క్లుప్తంగా

డ్రోన్ సర్వేతో భూ సమస్యల పరిష్కారం



పాములవాకంలో డ్రోన్ సర్వే

కోటవురట్ల : రీ సర్వేతో రికార్డులు, డేటా స్వచ్ఛీకరణ జరుగుతుందని తహసీల్దార్ జానకమ్మ అన్నారు. పాములవాక గ్రామంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా శుక్రవారం డ్రోన్ సర్వే ప్రారంభించారు. తహసీల్దారు మాట్లాడుతూ భూ సర్వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందన్నారు. భూ వివాదాలు, తగాదాలు లేని గ్రామాలే లక్ష్యంగా రీ సర్వే జరుగుతోందన్నారు. సమాచారం ఇచ్చిన రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు, రికార్డులతో సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పద్మావతి, సర్పంచ్ డి.సత్యవతి, మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు, వీఆర్వో రమేష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేపు వాడ్రాపల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మునగపాక : మండలంలోని వాడ్రాపల్లిలో ఈ నెల 12న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం జరుగుతుందని నిర్వాహకులు వెలగా సురేష్‌కుమార్, పెంటకోట వెంకట గిరిబాబు, ఏవీఎన్ మూర్తి సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో 1986–87లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా సమావేశానికి హాజరు కావాలని వారు కోరారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు

మునగపాక : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత నాయకులు లంబా శ్రీనివాసరావు, పోతురాజు శుక్రవారం మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన సేవలందించిన అంబేడ్కర్‌పై తప్పుడు ప్రేలాపనలు చేయడం తగదన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో దళిత నాయకులు లంబా అర్జునరావు, బీలా లక్ష్మణరావు ఉన్నారు.

రేపు మునగపాకలో ఉచిత వైద్య శిబిరం

మునగపాక : మునగపాక ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 12న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సాగర్ హెల్త్‌కేర్ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ రవీంద్రదేవ్ వేచలపు, డెంటల్ సర్జన్ డాక్టర్ ఎ.పోలినాయుడు, దయాబటాలజిస్టు డాక్టర్ కె.అనూష వైద్య సేవలందిస్తారన్నారు. ఈ శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.

ఆలయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు



ముస్తాబు అవుతున్న అభయాంజనేయ స్వామి

ఎస్.రాయవరం : కొరుప్రోలు గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవానికి ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం వేకువ జామునుంచి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు చెప్పారు. శుక్రవారం రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

మునగపాక : గంగాదేవిపేటలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మూలపేట సర్పంచ్ బీశెట్టి గంగప్పలనాయుడు తెలిపారు. మూలపేట శివారు గంగాదేవిపేటలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. గంగాదేవిపేటలో తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఆయన వెంట ఉప సర్పంచ్ దేవీచంద్ర, వార్డు సభ్యుడు గోవిందరావు, పాలసంఘ అధ్యక్షుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సర్పంచ్ గంగప్పలనాయుడు, ఉప సర్పంచ్ దేవి చంద్ర సందర్శించారు.

ఘనంగా అడవిరాజులబాబు పండగ



సన్యాసిరాజుపాలెంలో అడవిరాజులను దర్శించుకున్న ఎంపీటీసీ రాంబాబు తదితరులు



పాములవాకలో ఆలయానికి ఊరేగింపుగా వెళుతున్న గ్రామస్తులు

కోటవురట్ల : అడవిరాజులబాబు పండగ సందర్భంగా పల్లెల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయాల వద్ద సందడి కనిపించింది. మండలంలోని పాములవాక, సన్యాసిరాజుపాలెం తదితర గ్రామాల్లో శుక్రవారం అడవిరాజులబాబు పండగను ఘనంగా జరుపుకొన్నారు. గ్రామస్తులంతా గ్రామ పొలిమేరల్లో ఉన్న ఆలయాలకు చేరుకుని పూజలు నిర్వహించారు. పాములవాకలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళల కోలాటం విశేషంగా ఆకట్టుకుంది. మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. సన్యాసిరాజుపాలెంలో ఎంపీటీసీ సభ్యుడు పెట్ల రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కన్నబాబు తదితరులు ఆలయంలో దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

దేవవరం ఎంపీటీసీ ఉప ఎన్నికకు సన్నాహాలు

- మార్చి 2న ఓటర్ల జాబితా ప్రకటన
- మరో రెండు వార్డు పదవులకు కూడా..



వివరాలు వెల్లడిస్తున్న ఎంపిడీవో, ఈవోపీఆర్‌డీలు

నక్కపల్లి : మండలంలో ఖాళీలున్న స్థానిక సంస్థలకు ఉప ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఎంపీడీవో సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణలు తెలిపారు. మండలంలో దేవవరం ఎంపీటీసీ సెగ్మెంట్‌కు, రేబాకలో పంచాయతీలో 1 వార్డు సభ్యునికి, చినదొడ్డిగల్లులో ఒక వార్డు సభ్యునికి, అలాగే ఉప సర్పంచ్ పదవికి ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. దేవవరం ఎంపీటీసీ స్థానానికి గతంలో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున గొర్ల రాఘవకుమారి గెలుపొందారు. అంతకుముందు జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కూడా రాఘవకుమారి సర్పంచ్‌గా విజయం సాధించారు. ఒక వ్యక్తి రెండు పదవులు చేపట్టడానికి నిబంధనలు అంగీకరించకపోవడంతో రాఘవ కుమారి ఎంపీటీసీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమయింది. రేబాకలో ఒక వార్డు సభ్యుడు మృతిచెందాడు. చినదొడ్డిగల్లు వార్డు సభ్యునిగా, ఎంపీటీసీగా గెలుపొందిన వెలగా ఈశ్వరరావు వార్డు సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఈ రెండు గ్రామాల్లో వార్డు సభ్యత్వ పదవులకు ఉప ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ పదవులు ఖాళీ అయి దాదాపు ఏడాది గడచిపోతోంది. దీంతో ఉప ఎన్నికల నిర్వహణకు అధికారులు ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపించారు. ఈ ప్రక్రియలో భాగంగా వచ్చేనెల 2వ తేదీన దేవవరం ఎంపీటీసీ ఉప ఎన్నికకు సంబంధించి ఓటర్ల జాబితా ముసాయిదాను పంచాయతీ కార్యాలయంలో ప్రకటిస్తున్నట్టు ఎంపీడీవో సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ తెలిపారు. వార్డు సభ్యత్వ పదవులకు ఈనెల 27వ తేదీన ఆయా గ్రామ పంచాయతీల్లో ఓటర్ల జాబితాలు ప్రకటిస్తామన్నారు. అభ్యంతరాలుంటే తెలియజేయవచ్చన్నారు.

అమల్లోకి ఎన్నికల కోడ్..

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి షెడ్యూలు విడుదలైన నేపథ్యంలో ఎన్నికల కోడ్‌అమల్లో ఉందని ఎంపీడీవో సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ తెలిపారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల నియమావళి గురువారం నుంచే అమల్లోకి వచ్చిందన్నారు. మార్చి 20 వరకు ఎన్నికల నియమావళి అమల్లో ఉంటుందన్నారు. గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించాలని కోరారు.

అమ్మవారి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ఎం.జగన్నాథపురంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయ పునఃనిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. కర్రి చినబ్బాయి, కాశిమణి దంపతుల చేతుల మీదుగా భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొరెడ్ల బుల్లెమ్మ, భీముని అంకునాయుడు, భీముని నాగేశ్వరరావు, పైలా రాంబాబు, కొరెడ్ల సూర్య ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

నక్కపల్లి : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీవో సీతారామరాజు కోరారు. శుక్రవారం ఆయన ఉపమాక లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. స్థలాలు పొందిన వారంతా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. మిగిలినవారు కూడా త్వరగా ప్రారంభించి పూర్తిచేయాలన్నారు. లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, గృహనిర్మాణ శాఖసిబ్బందిని ఆదేశించారు.

పి.ఆనందపురంలో అధికారుల విచారణ



విచారణ జరుపుతున్న డీపీవో శిరీషారాణి, జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామమూర్తి

మునగపాక : పల్లపు ఆనందపురంలో శుక్రవారం డీపీవో శిరీషారాణి, జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామమూర్తి విచారణ చేపట్టారు. పల్లపు ఆనందపురం ఎంపీటీసీ కర్రి సంజీవిని, పంచాయతీ కార్యదర్శి షహీమా మధ్య తలెత్తిన వివాదాన్ని పరిష్కరించేందుకు అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి ఇద్దరు అధికారులతో విచారణ కమిటీని నియమించారు. ఈ మేరకు అధికారులు సచివాలయంలో విచారణ చేపట్టారు. వివాదానికి దారితీసిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని శిరిషారాణి,శ్రీరామమూర్తి తెలిపారు. వారి వెంట ఎంపీడీవో రవికుమార్,ఈవోఆర్డీ ఈశ్వరరావు ఉన్నారు.

గూండ్రుబిల్లిలో టీడీపీకి ఝలక్

- పార్టీని వీడిన ఏడు కుటుంబాల టీడీపీ నేతలు
- ఎంపీపీ గోవింద్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎంపీపీ గోవింద్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన గూండ్రుబిలి టీడీపీ నేతలు

యలమంచిలి : మండలంలోని గూండ్రుబిల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఏడు కుటుంబాలు శుక్రవారం యలమంచిలి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎంపీపీ బోదెపు గోవింద్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. గూండ్రుబిల్లి గ్రామానికి చెందిన సర్వసిద్ధి అప్పారావు, కొల్లి సోమేష్, ఓగిబోయిన రమణ, కొల్లి సత్తాలు, యలమంచిలి సాయి, కురందాసు బండియ్య సర్వసిద్ధి మునలయ్య కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ బోదెపు గోవింద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, యలమంచిలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కన్నబాబురాజుల పరిపాలనలో నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతోందని అన్నారు. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి చెందిన నేతలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడం హర్షించదగ్గ విషయమన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కన్నబాబురాజు సారథ్యంలో వైఎస్సార్‌సీపీ పటిష్టంగా ఉందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మరింత మంది టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరేందుకు మొగ్గు చూపుతున్నారని అన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం ఎమ్మెల్యే కన్నబాబురాజు కల్పిస్తారని తెలిపారు. రూరల్ వైఎస్సార్‌సీపీ నాయకులు కొల్లి త్రినాథ్, కొత్తలి, రుక్మిణీపురం, సర్పంచ్‌లు మర్రిరాజు, పండు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు



కొరుప్రోలులో బోరు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఎస్.రాయవరం : గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు. గ్రామాల్లో మరమ్మతులకు గురయిన తాగునీటి బోర్లు అందుబాటులోనికి తీసుకు రావాలని సిబ్బందిని ఆదేశించినట్టు చెప్పారు. ఈ శుక్రవారం కొరుప్రోలు, తిమ్మాపురం, పి.ధర్మవరం తదితర గ్రామాల్లో చేతి బోరు మెకానిక్‌లు మరమ్మతులు చేపట్టినట్టు చెప్పారు. వీటితో పాటు నిత్యం సరఫరా చేసే రక్షిత మంచినీటి పథకానికి ఆటంకాలు కలగకుండా చూడాలని ఆదేశించామన్నారు.

కొనసాగుతున్న నిర్వాసితుల ధర్నా

రాంబిల్లి: నేవీ నిర్వాసితులు, నేవీ ప్రభావిత గ్రామాల ప్రజలు ధర్నా కొనసాగిస్తున్నారు. శుక్రవారం నాటికి ధర్నా 103 రోజులకు చేరింది. వాడనర్సాపురం, కొత్తపట్నం, కొప్పుగొండుపాలెం, వాడపాలెం, నేవీ పునరావాసకాలని, గోవిందపాలెం, చినకలవలాపల్లి, కొత్తపేట గ్రామాలకు చెందిన పలువురు ఈ ధర్నాలో పాల్గొన్నారు.

రాజు తలచుకుంటే కబ్జాకు కొదవా..

- రూ.కోటిన్నర విలువైన చెరువు గర్భం ఆక్రమణ
- చదును చేసి లేఅవుట్ సిద్ధం చేస్తున్న రియల్టర్
- టీడీపీ నేత ప్రోత్సాహంతో అక్రమాలు
- సర్వేలో బయటపడ్డ వాస్తవాలు



ఆక్రమణలు గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న సర్వే సిబ్బంది

నక్కపల్లి: మండలంలోని వేంపాడు సర్వే నంబర్ 207లో సుమారు 50 ఎకరాల చెరువు ఉంది. దీనికి ఆనుకుని ఉన్న జిరాయితీ భూమిని ఒక వ్యక్తి కొనుగోలు చేశాడు. ఈ భూమిని లేవుట్ వేసేందుకు చదును చేశాడు. జిరాయితీ భూమిని ఆనుకుని ఉన్న చెరువులో సుమారు ఎకరం పైగా ఆక్రమించి దాన్ని కూడా చదును చేశాడు. చెరువులో వేలాది క్యూబిక్ మీటర్ల మట్టిని రేయింబవళ్లు పొక్లెయిన్లతో తవ్వించి ట్రాక్టర్లపై తరలించి లేఅవుట్‌గా ఏర్పాటు చేశాడు. ఈ అక్రమాలన్నీ ఓ టీడీపీ నాయకుడి కనుసన్నల్లోనే జరుగుతున్నట్టు సమాచారం. దీనిపై ఫిర్యాదు రావడంతో ఇన్‌చార్జ్ తహసీల్దార్ నీరజ స్పందించారు. శుక్రవారం ఆ స్థలాన్ని సర్వే చేయించారు. చెరువులో సుమారు ఎకరం స్థలాన్ని ఆక్రమించినట్లు గుర్తించారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు.

ఎస్‌ఈజెడ్ సమీపంలోనే..

నక్కపల్లి మండలంలో ఏపీఐఐసీ వారు ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటు చేస్తున్నారు. వేంపాడులో సుమారు 600 ఎకరాలు సేకరించారు. ఈ భూములకు సమీపంలోనే రియల్టర్ లేఅవుట్ వేస్తున్నాడు. దీనిని ఆనుకుని ఏర్పాటు చేసిన మరో లేఅవుట్‌లో పంటకాలువపై ఎటువంటి అనుమతులు లేకుండా కల్వర్టు సైతం నిర్మించేశాడు. వేంపాడు నుంచి బంగారయ్యపేట, అమలాపురం వెళ్లే రోడ్డును ఆనుకుని ఉన్న భూముల్లో ఇంత బాగోతం జరుగుతున్నా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టలేదు. చుట్టుపక్కల రైతులు ఫిర్యాదు చేస్తే తప్ప ఉన్నతాధికారుల దృష్టికి ఈ అక్రమాలు రాలేదు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

సర్వే నంబర్ 207లో చెరువు గర్భాన్ని ఆక్రమించి చదును చేసినట్టు మా దృష్టికి రావడంతో వెళ్లి పరిశీలించాం. సర్వే చేసి హద్దులు నిర్ణయించాం. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. చెరువును ఆక్రమించి చదును చేసిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేశాం.

– నీరజ, ఇన్‌చార్జ్ తహసీల్దార్, నక్కపల్లి

సైబర్ మోసాల పట్ల అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న ఎస్‌ఐ ఆలీ

మునగపాక : మహిళలు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ మహమ్మద్ ఆలీ కోరారు. మండలంలోని నాగులాపల్లిలో శుక్రవారం సాయంత్రం సైబర్ మోసాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ఎక్కడ చూసినా మోసాలకు పాల్పడే వారి సంఖ్య పెరుగుతుందన్నారు. బ్యాంక్ ఖాతాల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇతరులు ఎవరైనా ఓటీపీ అడిగితే వారికి సమాధానం ఇవ్వరాదన్నారు. మహిళలను లక్ష్యంగా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అలాగే సాయం సమయంలో పొలాల నుంచి వచ్చేటపుడు జాగ్రత్తగా ఉండాలన్నారు.

రోడ్డు నిర్మాణానికి మళ్లీ కొలతలు



రోడ్డు నిర్మాణానికి కొలతలు తీసుకుంటున్న రెవెన్యూ, ఆర్‌అండ్‌బి, పంచాయతీ సిబ్బంది

పాయకరావుపేట : పట్టణంలో గల మెయిన్‌రోడ్డు నిర్మాణానికి అధికార యంత్రాంగం పనులు ప్రారంభిస్తున్నారు. రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకుంటున్న చిన్న వర్తకులు రోడ్డు విస్తరణ చేస్తే తమ వ్యాపారాలకు ఇబ్బంది కలుగుతుందని, తమకు ప్రత్యామ్నాయం చూపించాలని కోర్టును ఆశ్రయించారు. దీంతో మూడేళ్లుగా రోడ్డు నిర్మాణం, విస్తరణ జరగకుండా నిలిచిపోయాయి. రోడ్లు భవనాల శాఖ పరిధిలో వున్న ఈ రోడ్డును మరింత అభివృద్ధి చేయడానికి విశాఖపట్నం వుడా పరిధిలోకి చేర్చారు. అప్పట్లో రోడ్డు నిర్మాణానికి కిలోమీటరున్నర మెయిన్‌రోడ్డుకు రూ. 6 కోట్లు సుమారుగా నిధులు మంజూరయ్యాయి. చిన్నవర్తకులు కోర్టును ఆశ్రయించడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. దీంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యకు ప్రజాప్రతినిధులు స్పందించి, రోడ్డును పరిశీలించారు. అధికారులతో సమీక్షలు జరిపారు. ఆర్‌డీవో జయరాం రోడ్డును పరిశీలించి, చిన్న వర్తకులకు నష్టం జరగకుండా రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని, మళ్లీ రోడ్డు అభివృద్ధికి కొలతలు తీసుకోవాలని, రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకుంటున్న చిన్న వర్తకుల జాబితాను కూడా తయారుచేయాలని ఆదేశించారు. ఈమేరకు రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులు మరలా రోడ్డుకు కొలతలు తీసుకుంటున్నారు.

సముద్రంలో వేటకెళ్లే మత్స్యకారులకు కోస్ట్‌గార్డ్ సూచనలు

ఎస్.రాయవరం : మత్స్యకారులు సముద్రంలోనికి చేపల వేటకు వెళ్లేటప్పుడు విధిగా జాగ్రత్తలు పాటించాలని నేవీ కోస్ట్‌గార్డు సిబ్బంది కిషోర్‌కుమార్, అమన్ ద్వివాది అన్నారు. బంగారమ్మపాలెం, రేవుపోలవరం గ్రామాల్లో శుక్రవారం పలువురు మత్స్యకారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సముద్రంలోకి వెళ్లినవారు తీసుకోవాల్సి జాగ్రత్తలు, సముద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు పాటించాల్సిన నియమాలతో కూడిన కరపత్రాలను పంచారు. చేపల వేటకు వెళ్లేవారు ఒంటరిగా కాకుండా అందరితో కలిసి వెళ్లాలని, దేశ జెండా పడవపై ముందు, వెనుక భాగాల్లో కనిపించే విధంగా అమర్చుకోవాలని అన్నారు. పడవ ప్రయాణంలో లైఫ్ జాకెట్ విధిగా తీసుకు వెళ్లాలన్నారు. పడవ రంగు ప్రభుత్వ అధికారులు చెప్పినట్టు ఉండాలన్నారు. పడవలో ఎరుపు రంగు వస్త్రం ఉంచుకోవాలన్నారు. పడవలో వాతావరణం సమాచారం తెలుసుకునేందుకు రేడియో వంటి వస్తువు ఉంచుకోవాలన్నారు. దేశ సముద్ర సరిహద్దు దాటకుండా జాగ్రత్త పడాలన్నారు. ఇలా గ్రామంలో పలు వీధుల్లో ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో వాకపాడు ఎంపీటీసీ మాధవ కూడా పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా పాటుపడాలి



మాట్లాడుతున్న రోటరీ పూర్వ గవర్నర్ రామారావు

మునగపాక : మహిళలు సొంతంగా వ్యాపారం చేస్తూ ఆర్థిక స్వావలంబన సాధించాలని రోటరీ పూర్వ గవర్నర్ రామారావు కోరారు.నాగులాపల్లిలో రోటరీ ఫౌండేషన్ గ్లోబరీ గ్రాంట్ ద్వారా ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ శిబిరంలో పాల్గొన్న మహిళలకు శుక్రవారం కుట్టుమిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుట్టుమిషన్లతో పాటు బ్యాంక్ రుణ సదుపాయం అందజేస్తామన్నారు. కుటీర పరిశ్రమల ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ సీహెచ్ అప్పలనాయుడు మాట్లాడుతూ మహిళలకు కుట్టుమిషన్లపై శిక్షణ ఇచ్చిన దేవిని అభినందించారు. జన శిక్షణ సంస్థాన్ ప్రతినిధులు డీఏ నాయుడు, మనోహర్, మళ్ల బుజ్జి, రామ్మోహన్ పాల్గొన్నారు.

ఆవ కాలువను బాగు చేయరూ..



స్వరూపం కోల్పోతున్న ఆవ కాలువ

మునగపాక : మునగపాకలోని ఆవ కాలువ తన స్వరూపం కోల్పోతుంది. కాలువను ఆనుకొని భారీ వృక్షాల మోడులు వేసేయడంతో సీజన్‌లో ఎగువ నుంచి వచ్చే నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. కేవలం సాగునీటి కాలువలపై ఆధారపడి పంటలు సాగు చేసే రైతులు ఆవ కాలువ దుస్థితిని చూసి ఆవేదన చెందుతున్నారు. కాలువలను ఎప్పటికపుడు అభివృద్ధి చేయాల్సిన నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో సాగునీటి ప్రవాహం ప్రశ్నార్థకంగా మిగిలిపోతుందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాలువను అభివృద్ధి చేసి రైతులకు వినియోగంలోకి వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలంలో పాగా



ఆక్రమణను అడ్డుకొంటున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు రమణ తదితరులు

- పంచదార్లలో కంకరతో కాలువను సైతం కప్పేసిన వైనం
- అధికారులకు వైఎస్సార్‌సీపీ నేతల ఫిర్యాదు
- టీడీపీ మండల అధ్యక్షుడు దిన్‌బాబే సూత్రధారంటూ ఆరోపణ

రాంబిల్లి: కోనేరు చెరువు గర్భంతోపాటు పంటకాలువను, ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి దర్జాగా కంకరతో కప్పేశారు. పొక్లెయిన్‌తో చదును చేస్తున్నారు.. పంచదార్లలో ప్రభుత్వ స్థలం కబ్జాపై శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు భర్త ధూళి రమణ వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకున్నారు. ఇదంతా టీడీపీ రాంబిల్లి మండల అధ్యక్షుడు వి. వెంకటేశ్వరరావు అలియాస్ దిన్‌బాబు చేస్తున్నట్లు రమణ తదితరులు ఆరోపించారు. దిన్‌బాబు దగ్గరుండి మరీ పట్టపగలు ప్రభుత్వ స్థలం సహా చెరువు కాలువను ఆక్రమించి లేఅవుట్ వేస్తున్నా అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వ స్థలాన్ని ఆనుకొని వున్న జిరాయతీ భూముల రైతులను తమపైకి దిన్‌బాబు ఉసిగొల్పినట్లు రమణ ఆరోపించారు. ఇక్కడ సెంటు స్థలం రూ. 5 లక్షలు పలుకుతోంది. సర్వే నెంబరు 141లో సుమారు 30 సెంట్ల వరకు ప్రభుత్వ స్థలం ఉంటుందని ఇప్పటికే సుమారు 3 సెంట్ల స్థలం, కాలువను సైతం ఆక్రమించి కంకరతో చదును చేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు పట్టపగలే ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకోవడం, కొండలను తవ్వేసి కంకరను తరలించుకుపోవడం, అనధికారిక లేఅవుట్ల లో కంకరతో చదును చేయడం యథేచ్ఛగా జరుగుతోంది.

చర్యలు తీసుకుంటాం

పంచదార్ల ప్రభుత్వ స్థలం, కాలువ ఆక్రమణలపై తమకు సమాచారం అందిందని, గతంలో కూడా ఇదే స్థలం ఆక్రమిస్తుండగా తాము అడ్డుకున్నామని తహసీల్దార్ పి.భాగ్యవతి చెప్పారు. మళ్లీ శుక్రవారం అదే స్థలాన్ని ఆక్రమించి కంకరతో లేఅవుట్ వేస్తున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. దీనిపై తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆక్రమణ వాస్తవమే.. కానీ ఇదొక్కటే కాదు

పంచదార్లలో ప్రభుత్వ స్థలం, చెరువు కాలువ ఆక్రమణ వాస్తవమేనని, అయితే తమ పంచాయతీలో చాలా ఆక్రమణలున్నాయని టీడీపీ మండల అధ్యక్షుడు దిన్‌బాబు అన్నారు. ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఆయనను వివరణ కోరగా.. తమ అనుచరులైన రైతులు పంట కాలువను కప్పి చదును చేస్తున్నారని, దీనిని కొందరు అడ్డుకోవడంతో తాను అక్కడకు వెళ్లానన్నారు. ఈ వ్యవహారంతో తనకు సంబంధం లేదన్నారు.

ముగిసిన దుర్గాలమ్మ పండగ

అనకాపల్లిటౌన్: విజయరామరాజుపేటలో వెలిసిన శ్రీ దుర్గాలమ్మ పండగ గురువారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ కమిటీ చైర్మన్ ఆళ్ల శివరామ సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఏడాది అమ్మవారి సారే ఊరేగింపు, ఉత్సవం ఒకేరోజు చేయడం జరిగిందని, రాత్రి అమ్మవారి ఘటాలను పురవీధుల గుండా ఊరేగించినట్టు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులను తీర్చుకున్నారు.